క్లుప్తంగా

28న కౌన్సిల్ సాధారణ సమావేశం

సామర్లకోట: స్థానిక మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం ఈ నెల 28వ తేదీ ఉదయం 11 గంటలకు కౌన్సిల్ హాల్‌లో చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ అధ్యక్షతన జరుగుతుందని కమిషనర్ జె.రామారావు శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గత నెలలో వాయిదా పడిన అజెండాలోని 46 అంశాలతో పాటు ఈ నెలలో పట్టణంలో అభివృద్ధి పనులకు సంబంధించిన మరో ఐదు అంశాలతో అజెండా తయారు చేశామన్నారు. దీనికి అధికార, ప్రతిపక్ష సభ్యులు, ఆయా శాఖలకు చెందిన అధికారులు హాజరు కావాలన్నారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోండి


శిక్షణ సర్టిఫికెట్లు అందుకున్న సిబ్బంది

సామర్లకోట: సచివాలయ కార్యదర్శులకు వివిధ అంశాలపై ఇస్తున్న శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని సీఆర్పీ శ్రీకై లాస్ అన్నారు. స్థానిక విస్తరణ శిక్షణ కేంద్రంలో శిక్షణ పూర్తయిన నాల్గో బ్యాచ్ అభ్యర్థులకు శుక్రవారం ఆయన సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా శ్రీకై లాస్ మాట్లాడుతూ శిక్షణలో నేర్చుకున్న అంశాలను తప్పక ఆచరించాలన్నారు. నోడల్ అధికారులు సుజాత, జ్యోతిరామ్, రామారావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్ చెక్ పవర్ పునరుద్ధరణ

కొత్తపల్లి: జిల్లా పంచాయతీ అధికారి రద్దు చేసిన తన చెక్ పవర్‌ను పునరుద్ధరిస్తూ హైకోర్టు ఆదేశాలు జారీ చేసిందని కొండెవరం గ్రామ సర్పంచ్ వేమగిరి చెల్లాయమ్మ తెలిపారు. మండలంలోని కొండెవరం పంచాయతీ కార్యాలయం వద్ద శుక్రవారం ఆమె విలేకర్ల సమావేశం నిర్వహించారు. తాను పంచాయతీ, 15వ ఆర్థిక సంఘం నిధులు దుర్వినియోగం చేశానని ఆరోపిస్తూ జిల్లా పంచాయతీ అధికారులు తన చెక్ పవర్‌ను రద్దు చేశారన్నారు. దీనిపై హైకోర్టును ఆశ్రయించగా తన చెక్ పవర్‌ను పునరుద్ధరిస్తూ ఆదేశాలు జారీ చేసిందన్నారు. దీనిపై మండల విస్తరణ అధికారి భాస్కరరావును వివరణ కోరగా తమకు జిల్లా అధికారుల నుంచి ఎటువంటి ఆదేశాలు అందలేదన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ దుళ్ల సత్తిబాబు, మాజీ ఎంపీటీసీలు గాది రాజబాబు, సుధాకర్, టీడీపీ నాయకుడు వేమగిరి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

రంగబాబుకు సత్కారం


రంగబాబును సత్కరిస్తున్న ఎమ్మెల్యే దొరబాబు

పిఠాపురం: వైఎస్సార్ సీపీ కాకినాడ జిల్లా కమిటీ సభ్యుడిగా నియమితులైన మార్నీడి రంగబాబును శుక్రవారం ఎమ్మెల్యే పెండెం దొరబాబు సత్కరించారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో రంగబాబును పూలమాల, శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకువెళ్లి పార్టీ బలోపేతానికి మరింత కృషి చేయాలని సూచించారు. పార్టీ కోసం కష్ట పడిన ప్రతి ఒక్కరికీ గుర్తింపు ఉంటుందన్నారు. అనంతరం తనపై నమ్మకంతో జిల్లా కమిటీలో అవకాశం కల్పించిన ఎమ్మెల్యే పెండెం దొరబాబుకు రంగబాబు కృతజ్ఞతలు తెలిపి సత్కరించారు. కార్యక్రమంలో పలువురు నేతలు పాల్గొన్నారు.

హోరు వాన

కొత్తపల్లి: మండల వ్యాప్తంగా శుక్రవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. రోడ్లన్నీ జలమయమయ్యాయి. గ్రామాల్లో పల్లపు ప్రాంతాలు నీట మునిగాయి. వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పలు గ్రామాల్లో రోడ్లు కాలువలను తలపించాయి. ఉప్పాడ బీచ్‌రోడ్డు సెంటర్‌లో డ్రైన్లు ఆక్రమించి షాపులను ఏర్పాటు చేయడంతో వర్షపు నీరు రోడ్డుపై నిలిచిపోయింది. వాకతిప్ప పోలీస్ స్టేషన్ ఎదురుగా, కొండెవరంలో ఉప్పాడ-పిఠాపురం రోడ్డులో నీరు నిలిచిపోయింది.

ధర్నాలపై నిషేధాన్ని ఎత్తివేయాలి

కాకినాడ సిటీ: రాజ్యాంగబద్ధమైన నిరసనలు, ర్యాలీలను నిషేధిస్తూ ఇచ్చిన జీవో నంబర్ ఒకటిని రాష్ట్ర హైకోర్టు కొట్టి వేసిన తర్వాత కూడా కలెక్టరేట్ ముందు అనధికార నిషేధాన్ని కొనసాగిస్తున్నారని అఖిల పక్షం నాయకులు అన్నారు.

గృహ నిర్మాణాల వేగవంతానికి చర్యలు

సామర్లకోట: జగనన్న కాలనీలలో గృహ నిర్మాణాల వేగవంతానికి చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా సామర్లకోటలో జగనన్న కాలనీల బాధ్యతలను జగ్గంపేట హౌసింగ్ డీఈ రాజ్‌కుమార్‌కు అప్పగించారు. ఆయన ఇక్కడ ఇన్‌చార్జి బాధ్యతలు నిర్వర్తించనున్నారు. అలాగే సామర్లకోట ఏఈ ఎం.వెంకటేశ్వరరావు స్థానంలో రూరల్ ఏఈ మహేష్‌ను ఇన్‌చార్జిగా నియమించారు. జగనన్న పనులు వేగవంతం కోసం ఈ మార్పులు చేసినట్లు ఉన్నతాధికారులు తెలిపారు.

ఆనందాల హరిఇల్లు

- ధనిక కాలనీలుగా పేదల ఇళ్లు
- నెరవేరుతున్న సొంతింటి కల
- ఆనందం వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు


గొల్లప్రోలు మండలం దుర్గాడ జగనన్న కాలనీలో నిర్మించిన ఇల్లు

పిఠాపురం: ఏళ్లు గడుస్తున్నాయి..నాయకులు మారుతున్నారు.. ప్రభుత్వాలు మారుతున్నాయి. కాని వారి బతుకులు మాత్రం మారలేదు. పూరి గుడిసెల్లో ఎండకు ఎండి వానకు తడిసి తల్లి పడుకుంటే పిల్లకు చోటు లేక, వంట చేసుకునేందుకు కూడా నిలువనీడ లేక దేవుడే దిక్కు అంటూ ఎందరో నిరు పేదలు కాలం వెళ్లబుచ్చుతున్నారు. ఓడలు బళ్లవుతాయి..బళ్లు ఓడలవుతాయి అన్నారు పెద్దలు. అది ఇప్పుడు నిజమవుతోంది. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల ప్రచారంలో పేదల సొంతింటి కలను నెరవేరుస్తానని హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చాక ఆ హామీని అమలు చేస్తుండడంతో నాడు పూరి గుడిసెలు... నేడు పక్కా భవనాలుగా మారుతున్నాయి. దళిత కాలనీలు ధనిక కాలనీలుగా మారుతున్నాయి. పేదల సొంతింటి కల నెరవేరడంతో వారి ఆనందానికి అవధుల్లేవు.

పేదల బతుకుల్లో వెలుగులు

గొల్లప్రోలు మండలంలో ఎన్నో ఏళ్లుగా వెనుకబడిన ప్రాంతాలుగా ఉన్న కాలనీల్లో ప్రస్తుతం వెలుగులు వచ్చాయి. కాలువ గట్టున పూరి గుడిసెల్లో ఏళ్ల తరబడి మగ్గిపోయిన వారు నేడు పక్కా భవనాల్లో కాపురాలు చేస్తున్నారు. తమ జీవితాల్లో వెలుగులు నింపిన ప్రత్యక్ష దైవం మా జగనన్న అంటూ సీఎం చిత్ర పటాన్ని ఇంట్లో పెట్టుకుని పూజించుకుంటున్నారు.

గొల్లప్రోలు మండలంలో వివరాలు	
మంజూరైన ఇళ్లు	1,293
నిర్మాణంలో ఉన్నవి	739
పూర్తయినవి	412

80 శాతం ఇళ్ల నిర్మాణం

గొల్లప్రోలు మండలంలో 1293 మంది గృహ లబ్ధిదారులను ఎంపిక చేయగా అందరికీ ఇళ్ల స్థలాలు మంజూరు చేశారు. ఇప్పటి వరకు 739 ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించారు. వాటిలో 412 మంది లబ్ధిదారులు ఇప్పటికే ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసి గృహ ప్రవేశాలు చేశారు. అన్ని చోట్ల జగనన్న కాలనీల నిర్మాణాలతో కొత్త గ్రామాలు రూపుదిద్దుకుంటున్నాయి. 80 శాతం నిర్మాణాలు చేపట్టడంతో జిల్లాలో జగనన్న కాలనీల నిర్మాణంలో గొల్లప్రోలు మండలం ముందజంలో ఉంది. అన్ని మెటీరియల్స్ సిద్ధంగా ఉన్నాయి. కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించడానికి ఎమ్మెల్యే పెండెం దొరబాబు కృషి చేస్తున్నారు.

– ఏసుబాబు, గృహనిర్మాణశాఖ ఏఈ, గొల్లప్రోలు మండలం

కల నెరవేరింది



మేము నిరుపేదలం. అద్దె ఇంట్లో ఉండేవాళ్లం. మా చుట్టు పక్కల వారు పెద్ద పెద్ద భవనాలు కట్టుకుంటుంటే జీవితంలో అలా ఇల్లు కట్టుకోగమా అనుకునే వాళ్లం. మా కలలను నిజం చేశారు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. ఇళ్ల స్థలం ఇచ్చి వెంటనే లోన్ మంజూరు చేశారు. మా ఓపిక ఉన్నంతలో అందరిలాగే ఆకర్షణీయమైన ఇల్లు కట్టుకున్నాం. కట్టెలపొయ్యిపై వంట చేసే నేను ఇప్పుడు అధునాతన వంట గదిలో వంట చేస్తున్నాను. ఇచ్చింది సెంటున్నర భూమి అయినా ఒక బెడ్‌రూం, కిచెన్, హాల్ ఇలా అన్ని వసతులతో ఇల్లు కట్టుకున్నాం. నేను, నా భర్త, ఇద్దరు పిల్లలు కొత్త భవనంలో అడుగు పెట్టిన క్షణాల్లో సీఎం జగన్ మాకు దేవుడిలా కనిపించారు.

– కొండేపూడి ఉమామహేశ్వరి, దుర్గాడ, జగనన్న కాలనీవాసి, గొల్లప్రోలు మండలం

సీఎం జగనే మా దేవుడు



గత 30 ఏళ్లుగా అద్దె ఇంట్లో ఉంటున్నాం. ఎన్నిసార్లు అర్జీలు పెట్టుకున్నా ఇళ్ల స్థలం మంజూరు కాలేదు. సీఎం వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చిన వెంటనే మాకు ఇళ్ల స్థలం ఇచ్చారు. మా జన్మలో సొంతింట్లోకి వెళతామని ఎప్పుడూ అనుకోలేదు. అలాంటిది ఇప్పుడు సొంతం ఇంట్లో ఉంటున్నాం. అదంతా సీఎం వైఎస్ జగన్ దయే. చంద్రబాబు హయాంలో ఎన్నో సార్లు అర్జీలు పెట్టుకున్నాం. జన్మభూమి కమిటీల చుట్టూ ప్రదక్షిణలు చేశాం. కాని అరసెంటు కూడా ఇవ్వలేదు. ఇప్పుడు సీఎం జగన్ ఇళ్ల స్థలం ఇచ్చి ఇల్లు కట్టిస్తే ఆ భూమిని శ్మశానంగా చెప్పడం చంద్రబాబు చేతగాని తనానికి నిదర్శనం. మేము ఎవ్వరి దగ్గరకు తిరగలేదు. వలంటీర్ మా ఇంటికి వచ్చాడు. మాకు ఇల్లు లేదని రాసుకున్నాడు. మాకు ఇళ్ల స్థలం వచ్చిందని చెప్పాడు. పట్టా తెచ్చి మా ఇంటికే ఇచ్చాడు.

– వెలుగుల గౌరీలక్ష్మి, లబ్ధిదారు, దుర్గాడ, గొల్లప్రోలు మండలం

రేపు విద్యార్థులకు పోటీలు


సమావేశంలో మాట్లాడుతున్న బుద్ధా శ్రీనివాస్

పెద్దాపురం: మాతృభాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 27న పెద్దాపురం చిల్డ్రన్ క్లబ్ (పీసీసీ) ఆధ్వర్యంలో విద్యార్థులకు వివిధ అంశాలపై పోటీలు నిర్వహించనున్నట్లు పీసీసీ గౌరవాధ్యక్షుడు బుద్ధా శ్రీనివాస్ తెలిపారు. స్థానిక వరహాలయ్యపేట యాసలపు సూర్యారావు భవనంలో శుక్రవారం పీసీసీ అధ్యక్షుడు కూనిరెడ్డి అరుణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 29న మాతృభాషా దినోత్సవం సందర్భంగా ఈ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. సబ్ జూనియర్ విభాగం (నాల్గవ తరగతి వరకూ), జూనియర్ విభాగం (5, 6, 7 తరగతులు), సీనియర్ విభాగం (8, 9, 10 తరగతి) విద్యార్థులకు పోటీలు ఉంటాయన్నారు. ఆంగ్ల పదం లేకుండా తెలుగు భాషా ఔన్నత్యాన్ని తెలియజేస్తూ ఉపన్యాస పోటీలు, పద్యపఠనం, వివిధ తెలుగు కవులు, రచయితల వేషాధారణ పోటీలు ఉంటాయన్నారు. ఆదివారం మధ్యాహ్నం రెండు గంటల నుంచి ఈ పోటీలు జరుగుతాయని ఆసక్తి గల విద్యార్థులు పోటీల్లో పాల్గొనాలని ఆయన కోరారు. సమావేశంలో రొంగల అరుణ్, కూనిరెడ్డి రవికుమార్, మంజుల తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలి


సమావేశానికి హాజరైన ప్రజాప్రతినిధులు, అధికారులు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే దొరబాబు

ఎమ్మెల్యే పెండెం దొరబాబు

పిఠాపురం: ప్రభుత్వ భవన నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే పెండెం దొరబాబు ఆదేశించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో భవన నిర్మాణాలపై నియోజకవర్గస్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులతో శుక్రవారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామస్థాయిలో ప్రజలకు మెరుగైన సేవలు అందించాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చారన్నారు.

ప్రతి గ్రామం, వార్డుల్లో గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, హెల్త్ క్లినిక్ సెంటర్ల భవన నిర్మాణాలపై దృష్టి సారించాలన్నారు. వీటి నిర్మాణానికి సంబంధించి బిల్లులు ఎప్పటికప్పుడు మంజూరు చేస్తున్నట్టు తెలిపారు. భవనాలను వేగంగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో పలు శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత


ఉప్పాడలో మొక్కలు పంపిణీ చేస్తున్న దృశ్యం

కొత్తపల్లి: ప్రతిఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని సచివాలయాల మండల కన్వీనర్ ఉమ్మిడి జాన్ కోరారు. మండలంలోని ఉప్పాడలో గ్రేస్ ఆఫ్ గ్రాండ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో చేపట్టిన లక్ష మొక్కల పంపిణీ కార్యక్రమాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. గ్రామంలో ప్రజలకు కొబ్బరి, జామ, మామిడి మొక్కలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాటిన మొక్కలను పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. గ్రేస్ ఆఫ్ గ్రాండ్ స్వచ్ఛంద సంస్థ సేవలను కొనియాడారు. పర్యావరణాన్ని పరిరక్షించాలనే ఉద్దేశంతో లక్ష మొక్కలను నాటుతున్నట్టు గ్రేస్ ఆఫ్ గ్రాండ్ ట్రస్ట్ చైర్మన్ పువ్వుల విజయ్ కుమార్ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు చొక్కా సింగన్న, మేరుగు యల్లాజీ, గోగు బుజ్జి, విప్పర్తి గాంధీ తదితరులు పాల్గొన్నారు.

యోగాతో మానసిక ప్రశాంతత


క్రియా యోగా దీక్ష పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సభ్యులు

కాకినాడ సిటీ/ కాకినాడ కల్చరల్: స్థానిక బాలాజీ చెరువు సెంటర్‌లోని టీటీడీ కల్యాణ మండపంలో ఆదివారం సాయంత్రం 6 గంటలకు సుషుమ్న క్రియా యోగా దీక్ష నిర్వహిస్తున్నట్లు సంస్థ మేనేజింగ్ ట్రస్టీ ఎస్.ప్రశాంతి తెలిపారు. శుక్రవారం ఇక్కడి జయ రెసిడెన్సీలో ట్రస్టీ సభ్యులు ఎస్.శిరీషదేవి, డాక్టర్ జె.శృతికీర్తి, కె.పద్మలతో కలసి నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. దీనిని దివ్య బాబాజీ సుషుమ్న క్రియా యోగా ఫౌండేషన్, అంతర్జాతీయ ఆధ్యాత్మిక సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రపంచ ప్రఖ్యాత గురువులు ఆత్మానందమయి అమ్మ హాజరై సంపూర్ణ ఆరోగ్య సాధనపై స్వయంగా అనుగ్రహిస్తారన్నారు. యోగా సాధనతో ఒత్తిడి తట్టుకునే శక్తి, మానసిక ప్రశాంతత, ఆరోగ్యకర జీవనం, ఉత్సాహం, సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందన్నారు. నగర ప్రజలతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల వారూ హాజరు కావాలని కోరారు. అనంతరం క్రియా యోగా ధ్యానం పోస్టర్లు ఆవిష్కరించారు. జేఎస్ఎన్ మూర్తి, ఎ.రామచంద్ర, పి.సంజయ్, డి.రజనీకాంత్, ఎం.బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చరిత్ర సృష్టించిన చంద్రయాన్-3


ఇస్రోకు సేవలందించిన అచ్యుతబాబు, గజ్జాటేలను సత్కరిస్తున్న సభ్యులు

కాకినాడ రూరల్: ఇస్రో పంపిన ల్యాండర్ మాడ్యూల్ చంద్రుడి దక్షిణ ధ్రువంపై తన పాదాన్ని మోపి చరిత్ర సృష్టించిందని ఇస్రో మాజీ ఉద్యోగి పి.అచ్యుతబాబు అన్నారు. రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో చంద్రయాన్-3 విజయోత్సవం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగేళ్ల కిందట పంపిన చంద్రయాన్-2 విఫలమైనా, పట్టు వదలని విక్రమార్కుల్లా ఇస్రో చంద్రయాన్-3ని ప్రయోగించి చారిత్రాత్మక విజయాన్ని సాధించిందన్నారు. ల్యాండర్ నుంచి రోవర్ వేరు పడి తన అన్వేషణను ప్రారంభించిందన్నారు. జేఎన్టీయూ ప్రొఫెసర్ డాక్టర్ ఆలపాటి శ్రీనివాస్ మాట్లాడుతూ చంద్రయాన్-3 విజయంతో అంతర్జాతీయ సాంకేతిక రంగంలో మన దేశం అగ్రగామిగా నిలిచిందన్నారు. గత 50 ఏళ్ల చరిత్రలో ఇదొక కీలకమైన మలుపు అన్నారు. దీనివల్ల మన దేశ ప్రతిష్ట మరింత ఇనుమడించిందన్నారు. డాక్టర్ అడ్డాల సత్యనారాయణ మాట్లాడుతూ ఈ విజయం ఇస్రో స్ఫూర్తికి నిదర్శనమన్నారు. సరైన ప్రణాళికతోనే ఇస్రోకు గొప్ప విజయాలు చేకూరాయన్నారు. వారి నిబద్ధత, నిరంతర కృషి ప్రతి భారతీయుడి హృదయాన్ని గర్వంతో ఉప్పొంగేలా చేశాయని అడ్డాల తెలిపారు. అనంతరం ఇస్రో సంస్థకు సేవలు అందించిన పి.అచ్యుతబాబు, ఎంఎస్ గజ్జాటేలను ఘనంగా సత్కరించారు. అడబాల రత్నప్రసాద్, ఎస్.శ్రీనగేష్, చింతపల్లి సుబ్బారావు, రామారావు, అడబాల సత్యనారాయణ, వరప్రసాద్, రాఘవరావు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీం క్షీర సముద్రరాజ తనయాం..


కుమారారామ భీమేశ్వరస్వామి ఆలయంలో సామూహిక వ్రతాల్లో మహిళలు


కొమరగిరిలోని దుర్గాదేవి అమ్మవారు

- భక్తిశ్రద్ధలతో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు
- పంచారామ క్షేత్రంలో భక్తుల కిటకిట

సామర్లకోట: శంఖచక్ర గదాహస్తే మహాలక్ష్మీ నమోస్తుతే.. వరాల తల్లీ, సర్వపాపహారిణీ పాహిమాం అంటూ ఆ వరలక్ష్మీ దేవిని భక్తిప్రపత్తులతో కొలిచారు. శ్రావణ శుక్రవారం పూజలతో ప్రతి ఇంటా పండగ శోభ వచ్చింది. వివిధ దేవాలయాలు భక్తులతో కిటకిటలాడారు. స్థానిక పంచారామ క్షేత్రమైన శ్రీబాలాత్రిపుర సుందరి సమేత కుమారరామ భీమేశ్వరస్వామి ఆలయంలో శ్రావణ మాసం రెండో శుక్రవారం సందర్భంగా సామూహిక వరలక్ష్మీ వ్రతాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ మాసంలో నాలుగు శుక్రవారాలు మహిళలు సామూహిక వ్రతాలు చేసుకునే విధంగా ట్రస్టు బోర్డు ఏర్పాట్లు చేసింది. వ్రతాల్లో పాల్గొనే మహిళలు బియ్యం, కలశం మాత్రమే తీసుకుని రాగా వ్రతాలకు కావాల్సిన వరలక్ష్మీ రూపు, తోరాలు, లక్ష్మీదేవి ఫోటో, గాజులు, పువ్వులు, ప్లేటు, ప్రమిదలు, ఒత్తులు, నూనె, ట్రస్టు బోర్డు సభ్యులు దాతల నుంచి ఏర్పాటు చేశారు. దేవస్థానం నుంచి ప్రసాదం, దాతలు ఇచ్చిన సామగ్రిని భక్తులకు అందజేశారని ట్రస్టు బోర్డు చైర్మన్ మట్టపల్లి రమేష్‌బాబు తెలిపారు. ఆలయ మొదటి అంతస్తులో సామూహిక వ్రతాలను రమేష్‌బాబు, ఈఓ వి.నాగమల్లేశ్వరరావు ప్రారంభించారు. ఆలయ అభిషేక పండితులు వేమూరి సోమేశ్వరశర్మ, సన్నిధిరాజు వెంకన్న, వినయ్, చెరుకూరి రాంబాబులు పూజలు చేశారు. 150 మంది మహిళలు పాల్గొని సామూహిక వ్రతాలు ఆచరించారు. వచ్చే నెల ఒకటి, 8వ తేదీల్లో సామూహిక వ్రతాలను నిర్వహిస్తామని అధికారులు తెలిపారు. సామూహిక వ్రతాల్లో పాల్గొన్న భక్తులకు బాలాత్రిపుర సుందరి సమేత కుమార రామభీమేశ్వరస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు. భక్తులకు ట్రస్టు బోర్డు సభ్యులు యండమూరి వెంకట సుబ్బారావు, నాతిపాముల సూరిబాబు, చల్లా కుమారి, భక్త సంఘం నాయకులు మసకపల్లి సత్యనారాయణ, చల్లా సత్తిబాబు, అంజనీకుమార్‌లు భక్తులకు సేవలందించారు. బడేలమ్మ చెరువు వద్ద వేంచేసి ఉన్న నవదుర్గ ఆలయంలో ధర్మకర్త విజయ లక్ష్మీదేవి ఆధ్వర్యంలో ఈవీకే మోహనరావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ, మాజీ మున్సిపల్ చైర్మన్ గోలి వెంకట అప్పారావు చౌదరిలు అమ్మవారిని దర్శించుకున్నారు. బ్రౌన్‌పేట సెంటర్‌లో యువకనకదుర్గ ఆలయంలో ఆలయ ధర్మకర్త నూతలపాటి సింహాచలం ఆధ్వర్యంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలను నిర్వహించారు.


సామర్లకోట పంచారామ క్షేత్రంలో వరలక్ష్మీ వ్రతాలను ప్రారంభిస్తున్న ఈఓ నాగమల్లేశ్వరరావు తదితరులు


పెద్దాపురం భువనేశ్వరీ పీఠంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు

పెద్దాపురంలో..

పెద్దాపురం: వరలక్ష్మీ వ్రతాలను పెద్దాపురం అర్బన్, రూరల్ ప్రాంతాల్లో భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. మండలంలోని చదలాడ, కాండ్రకోట, దివిలి, మర్లావ తదితర ప్రాంతాల్లో మహిళలు సామూహిక వ్రతమాచరించారు. పెద్దాపురం మరిడమ్మ అమ్మవారి ఆలయం, కాండ్రకోట నూకాలమ్మ ఆలయాల్లో మహిళలు కుంకుమ పూజలు చేశారు. దివిలి భాస్కరరామా రైస్‌మిల్లు వద్ద అమ్మవారిని నెలకొల్పి పూజలు నిర్వహించారు. భక్తభజన మండలి భజనలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. మర్లావ ఆలయంలో పూజలు జరిగాయి. పెద్దాపురం వర్జులవారి వీధిలోని భువనేశ్వరీ పీఠంలో పీఠాధిపతి చింతా గోపిశర్మ సిద్ధాంతి ఆధ్వర్యంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాన్ని ఆచరించారు.

మరిడమ్మకు పూజలు

కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పుగా పేరొందిన పెద్దాపురం మరిడమ్మ అమ్మవారికి శ్రావణ మాసం రెండో శుక్రవారం సందర్భంగా బంగారు, వెండి పుష్పాలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ట్రస్టీ చింతపల్లి బ్రహ్మాజీ, ఆలయ అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్‌వీ రామ్మోహనరావు ఆధ్వర్యంలో అమ్మవారి ప్రత్యేక అభిషేకాలు, చండీ హోమంతో పాటు బంగారు, వెండి పుష్పాలతో పూజలు చేశారు.

వరలక్ష్మీ నమోస్తుతే...


పాదగయ క్షేత్రంలో ప్రత్యేక అలంకరణలో పురుహూతికా అమ్మవారు, రాజరాజేశ్వరీదేవి


వరలక్ష్మీ వ్రతాలు ఆచరిస్తున్న భక్తులు

పిఠాపురం: శ్రావణ మాసంలో రెండో శుక్రవారం వరలక్ష్మీ వ్రతం సందర్భంగా దక్షిణ కాశీగా ప్రసిద్ధిగాంచిన పిఠాపురం పాదగయ క్షేత్రానికి భక్తులు పోటెత్తారు. తెల్లవారుజాము నుంచి వేలాదిగా తరలివచ్చిన భక్తులతో పాదగయ కిటకిటలాడింది. పాదగయ పుష్కరిణిలో మహిళలు, భక్తులు పుణ్య స్నానాలను ఆచరించారు. కుక్కుటేశ్వర స్వామి దేవస్థానంలోని పురుహూతిక, రాజరాజేశ్వరీదేవి అమ్మవార్ల సన్నిధిలో మహిళలు అత్యంత భక్తి శ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతాలు చేశారు. అనంతరం దేవాలయంలోని కుక్కుటేశ్వరస్వామి, రాజరాజేశ్వరి, పురుహూతిక అమ్మవార్లు, దత్తాత్రేయ స్వామి, సాయిబాబాలను దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నియోజకవర్గంలో అన్ని గ్రామాలు శ్రావణ శోభను సంతరించుకున్నాయి. పలు దుర్గాదేవి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవార్లను దర్శించుకున్నారు. మహిళలు ఎక్కువగా తమ ఇళ్ల వద్ద వరలక్ష్మీదేవి వ్రతాలు జరుపుకున్నారు.

ఆలయాలకు పోటెత్తిన భక్తులు

కొత్తపల్లి: శ్రావణమాసంలో రెండో శుక్రవారం కావడంతో ఆలయాలకు భక్తులు పోటెత్తారు. తెల్లవారుజాము నుంచే ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. పండితులు అమ్మవార్లను వివిధ రకాల పూలతో సుందరంగా అలంకరించారు. కొత్తపల్లి శ్రీధర్మశాస్తా ఆలయంలోని దుర్గాదేవి, కొత్తదొడ్డిలోని బాలదుర్గ, యండపల్లి, వాకతిప్ప, కుతుకుడుమిల్లి, కొండెవరం గ్రామాల్లోని అమ్మవార్ల ఆలయాల్లో సామూహిక పూజలు నిర్వహించారు.